# నమస్తే తెలంగాణ
## మహబూబ్‌నగర్
## నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, మంగళవారం 9 జూలై 2024 | MAHABUBNAGAR NARAYANPET


# నేడు పాలమూరుకు సీఎం

- సొంత గడ్డపై తొలిసారి సమీక్ష
- పర్యటన ముగిసే వరకు మీడియాకు నోఎంట్రీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, కలెక్టర్

మహబూబ్‌నగర్, జూలై 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రేవంత్‌రెడ్డి.. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహించనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12:45 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుంటారు. మహిళాశక్తి క్యాంటీన్, అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన తరువాత ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధిపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. కాగా, ముఖ్యమంత్రి పర్యటన ముగిసే వరకు మీడియాకు అనుమతిని నిరాకరించారు. కేవలం మీడియా సెంటర్‌లో మాత్రమే పత్రికా ప్రతినిధులను అనుమతిస్తున్నారు. కాగా, సీఎం పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ జానకి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా హెలీప్యాడ్, సమీక్ష నిర్వహించే సమీకృత జిల్లా అధికారుల సముదాయం సమావేశ మందిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో నర్సింహులు, డీఎఫ్‌వో సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.



తాజా మాజీ ప్రజాప్రతినిధులను సన్మానించి మెమెంటోలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

# బీఆర్‌ఎస్‌పై ప్రజలకు నమ్మకం

- స్థానిక సంస్థల్లో సత్తా చాటుదాం
- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్, జూలై 8 : బీఆర్‌ఎస్‌పై ప్రజలకు నమ్మకం ఉందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అన్నాసాగర్ గ్రామంలోని తన నివాస గృహంలో తాజా మాజీ ఎంపీటీసీలు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలకు సోమవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల మాట్లాడుతూ రెండోసారి బీఆర్‌ఎస్ అధికారం చేపట్టిన ఐదేండ్లల్లో ఆయా గ్రామాల్లో ఎంతో అభివృద్ధి చేశామని, ఇంత డెవలప్‌మెంట్ మున్ముందు ఇక ఎవరూ చేయలేరన్నారు. పదవిలో ఉన్నా లేకున్నా కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని అన్నారు. గ్రామాల్లో ఇప్పటికీ తమకు బలమైన కార్యకర్తలున్నారని, వారిని సక్రమంగా చూసుకుంటే రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ అధికారం చేపడుతుందన్నారు. 2014, 2018 కాలం నాటి పరిస్థితులను గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ ప్రజాప్రతినిధులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, మాజీ ఎంపీపీలు మౌనిక, రమ, హర్షవర్ధన్‌రెడ్డి, కళావతి, జెడ్పీటీసీలు రాజశేఖర్‌రెడ్డి, ఇంద్రయ్యసాగర్, రాజేశ్వరి, అన్నపూర్ణ, బీఆర్‌ఎస్ నాయకుడు వామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ బీమా చెక్కును బాధిత కుటుంబసభ్యులకు అందజేస్తున్న గువ్వల బాలరాజు

# కార్యకర్తలకు అండగా ఉంటాం

- బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

బల్మూర్, జూలై 8 : కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు తెలిపారు. మండలంలోని కొండనాగుల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఉడతనూరి సునీల్‌కుమార్ విద్యుదాఘాతంతో మరణించగా.. పార్టీ నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును సోమవారం హైదరాబాద్‌లో మృతుడి తండ్రి నర్సింహకు అందజేశారు. కార్యకర్తలు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని గువ్వల తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ మండలాధ్యక్షుడు చందు, నాయకులు సుల్తాన్, నిరంజన్, సుధాకర్‌గౌడ్, ఈశ్వర్ పాల్గొన్నారు.



తెల్లరాళ్లపల్లి తండాలో ఎంజీకేఎల్ఐ కాల్వను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

# కాల్వకు మరమ్మతులు చేపట్టాలి

- లేకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం
- ఎంజీకేఎల్ఐ కాల్వను పరిశీలించిన రైతు సంఘం నాయకులు

పాన్‌గల్, జూలై 8 : ఎంజీకేఎల్ఐ కాల్వకు మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టుకు సాగునీరందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.బాల్‌రెడ్డి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్యానాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని తెల్లరాళ్లపల్లి తండా సమీపంలో ఉన్న ఎంజీకేఎల్ఐ కాల్వను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానకాలం సీజన్ ప్రారంభమైనా ఇప్పటివరకు కాల్వ మరమ్మతులు చేపట్టలేదన్నారు. దీంతో కాల్వలో చెట్లు, జమ్ము, మట్టి నిల్వలు చేరి సాగునీరు కిందకు సాఫీగా పారే అవకాశం ఉండదన్నారు. కోడేరు మండలం జొన్నలబొగుడ నుంచి తెల్లరాళ్లపల్లి తండా వరకు కాల్వ విస్తరణ, లైనింగ్ పనులు పూర్తి చేయాలని.. లేకుంటే రైతులను సమీకరించి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బాబూనాయక్, బాషా, శంకర్, రవినాయక్, ధర్మానాయక్, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్ ప్రభుత్వంలో జూన్ చివరికే..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వానకాలం సీజన్ ప్రారంభమయ్యాక రైతుబంధు పంపిణీకి శ్రీకారం చుట్టేది. నాటి ప్రభుత్వం రైతుబంధు పంపిణీ చేసిన వివరాలను పరిశీలిస్తే.. 2021లో జూన్ 21న, 2022లో జూన్ 29న, 2023లో జూన్ 27 పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమచేసింది. 2023లో ఎన్నికల కోడ్ సందర్భంగా పూర్తి స్థాయిలో పంపిణీ చేయలేదు. మిగిలిపోయిన రైతులకు కాంగ్రెస్ సర్కారు విడుదల చేసింది. ప్రస్తుతం వానకాలం సీజన్ ప్రారంభమైనా రేవంత్ సర్కారు సాయం ఊసెత్తడం లేదు. ఎంతమందికి రైతుభరోసా ఇస్తారనేది ఇప్పటి వరకు అధికారికంగా రైతుల వివరాలను ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ నివేదించలేదన్నట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని త్వరగా రైతు భరోసా పంపిణీ చేయాలని కోరుతున్నారు.



- కర్షకులకు 'భరోసా'నివ్వని కాంగ్రెస్ ప్రభుత్వం
- వానకాలం సాగు ప్రారంభమైనా ఊసెత్తని వైనం
- ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో కాలయాపన
- కౌలు రైతులకు ఎలాంటి స్పష్టతనివ్వని సర్కారు
- జోగుళాంబ గద్వాల జిల్లా రైతుల ఎదురుచూపు
- కేసీఆర్ ప్రభుత్వంలో జూన్ చివరికే పెట్టుబడి సాయం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

# పెట్టుబడి తిప్పలు

## రైతుభరోసా కోసం ఎదురుచూపు

గద్వాల, జూలై 8 : వానకాలం సాగు జోరందుకున్నది. సీజన్ ప్రారంభమయ్యే జూన్, జూలై మాసాలు రైతులను కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఓ వైపు పాఠశాలలు ప్రారంభం కావడం, మరో వైపు వ్యవసాయ పనులు కూడా అప్పుడే షురూ కావడంతో రైతులపై ఈ రెండు నెలలు ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. తమ పిల్లలకు పాఠశాల పుస్తకాలు, డ్రెస్‌లతోపాటు ఫీజులు చెల్లించాల్సి రావడం.. దీంతోపాటు పంటలు సాగులో భాగంగా విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు డబ్బు అవసరం. ఈ తరుణంలో రైతులకు ఏమి చేయాలో పాలుపోవడం లేదు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతుల్లో నెలకొన్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వానకాలం సీజన్ ప్రారంభమైందే మొదలు రైతుబంధు సాయం అందించేది. దీంతో పెట్టుబడితోపాటు పిల్లలకు బడుల ఫీజు చెల్లించేందుకు అనుకూలంగా ఉండేది. అయితే కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రావడంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. రెండు సీజన్లకుగానూ సకాలంలో ఇవ్వాల్సిన రైతుభరోసా సమయానికి ఇవ్వకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. వానకాలం వచ్చిందంటే పంటలకు పెట్టుబడి కాలంగా చెప్పాలి. రైతులు వ్యవసాయ భూములు చదునుచేసి దుక్కిదున్ని విత్తనాలు, ఎరువుల కోసం పెద్ద మొత్తంలో ఖర్చుచేయాల్సి ఉంటుంది. ఇప్పటికే దుక్కులు దున్ని విత్తులు విత్తారు. ప్రస్తుతం కలుపుతీసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే సీజన్ ప్రారంభమైనా ప్రభుత్వం రైతు భరోసా కింద అందించాల్సిన సాయం ఇంకా రైతుల ఖాతాల్లో జమ చేయలేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో కాలయాపన చేస్తుండండతో అన్నదాతలు రేవంత్ ప్రభుత్వంపై తీవ్రఆగ్రహంతో ఉన్నారు.

ఎన్నికల సమయంలో రైతులందరికీ ఎటువంటి షరతులు లేకుండా రైతు భరోసా ఇవ్వడంతోపాటు కౌలు రైతులకు సైతం అందిస్తామని హామీ ఇచ్చిన విషయం విదితమే. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్ని ఎకరాల వరకు రైతుభరోసా అందించాలనే అంశంపై రైతులు, రైతు సంఘాలతో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తుండడంపై సర్వత్రా విమర్శలు తలెత్తుతున్నాయి. యాసంగి సీజన్‌లో సైతం పెంచి ఇవ్వకుండా రైతుబంధు సాయం అందించిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడేమో అభిప్రాయ సేకరణ అంటూ కాలయాపన చేస్తుండడంపై రైతులు అసంతృప్తితో ఉన్నారు. దీనికి తోడు కౌలు రైతులకు రైతు భరోసాపై ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.



పొలంలో గుంటుక కొడుతున్న రైతు

### షరతులు లేకుండా అందించాలి



కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగా రైతులకు ఎటువంటి షరతులు లేకుండా ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వాలి. కేసీఆర్ ప్రభుత్వం వానకాలం సీజన్ ప్రారంభంకాగానే రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేసేది. దీంతో మొదటి విడుత పెట్టుబడి సాయానికి ఎంతగానో ఉపయోగపడేవి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సీజన్ ప్రారంభమైనా రైతుభరోసా ఇవ్వకుండా ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో ఆలస్యం చేస్తుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ వెంటనే అమలు చేసి రైతులందరికీ త్వరగా పంట పెట్టుబడి సాయం అందించాలి.

*- రంగస్వామి, రైతు, జమ్మిచేడు*

# ఆరోపణలన్నీ అవాస్తవాలే..

- టూరిజం హోటల్ లీజ్‌ను నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటా..
- అవాస్తవమని తేలితే మీరు తప్పుకుంటారా..?
- అధికారంలో ఉన్నది మీరే కదా.. నిరూపించాలి
- బ్యానర్లు చించినంత మాత్రాన అభిమానాన్ని చెరపలేరు
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 8 : బస్టాండ్ వద్ద నిర్మిస్తున్న టూరిజం హోటల్‌ను 99 ఏండ్లపాటు లీజ్‌కు తీసుకున్నానని మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాటల్లో వాస్తవంలేదని.. ఉన్నట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొనేందుకు సిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. అవాస్తవమైతే మీరు తప్పుకుంటారా అని సవాల్ విసిరారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. 'అధికారంలో ఉన్నది మీ ప్రభుత్వమే కదా నిరూపించండి.. ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తా. రోగుల బంధువులకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో సూపర్ స్పెషాలిటీ దవాఖాన ఎదుట షాపింగ్ కాంప్లెక్స్, హోటల్ నిర్మాణం చేపట్టాం' అని తెలిపారు. దేశ, విదేశీయులు, ఐటీ ఉద్యోగులు సమావేశాలు నిర్వహించుకునేందుకు హోటల్ నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆ పనులను పూర్తి చేసే ప్రయత్నం చేయకుండా తప్పుడు ఆరోపణలతో కాలం వెల్లదీస్తున్నారని విమర్శించారు. పట్టణంలో తన ఫొటోతో అభిమానులు ఫ్లెక్సీలు కడితే వాటిని చింపివేయడం దారుణమన్నారు. బ్యానర్లు చించినంత మాత్రాన ప్రజల గుండెల్లో అభిమానాన్ని చెరిపివేయలేరన్నారు. పాలమూరులో అభివృద్ధిని చూస్తే ప్రజలకు శ్రీనివాస్‌గౌడ్ గురుకొస్తాడన్న విషయాన్ని గమనించాలన్నారు. దౌర్జన్యాలు, తప్పుడు ఆరోపణలు మాని ప్రజలకు ఇచ్చిన హమీలు, అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, నిలిచిపోయిన పనులపై ఆలోచించాలని సూచించారు. ఐటీ కారిడార్, జంక్షన్లు, ట్యాంక్‌బండ్, కేసీఆర్ ఎకో అర్బన్ పార్క్, మెడికల్ కాలేజీలు, గురుకులాలు, మైనార్టీ స్కూళ్లు, కళాశాలల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇప్పుడే అధికారంలోకి వచ్చారు.. సమయం ఇద్దామనుకున్నాం కానీ తప్పుడు ప్రచారం చేస్తున్నందున మీడియా ముందుకు రావాల్సి వచ్చిందన్నారు. కేసీఆర్ హయాంలో జేఎన్‌టీయూ క్యాంపస్ ఏర్పాటుకు జీవో జారీ చేసినా.. ఇప్పటివరకు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. మన్యంకొండ దేవస్థానం వద్ద రోప్‌వే, అభివృద్ధి పనులు నిలిచిపోయాయన్నారు. యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ మంజూరు చేయించినా పనులు ప్రారంభంకాలేదన్నారు. అండర్ గ్రౌండ్ పనులు, హన్వాడ మండలంలో చెక్‌డ్యాంలకు నిధులు విడుదలైనా వాటిని ముందుకు తీసుకెళ్లడం లేదన్నారు. రూ.కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఆ పనులను ప్రారంభించాల్సింది పోయి రాజకీయం చేయడం తగదన్నారు. పదేండ్లల్లో ఎంతో కష్టపడి మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన తనపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. నాయకులు పార్టీ మారినంత మాత్రాన బీఆర్‌ఎస్‌కు ఎలాంటి నష్టం లేదని, క్షేత్రస్థాయిలో మరింత పటిష్టపరుస్తామని, తామే మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు శివరాజ్, కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, గణేశ్, రాంలక్ష్మణ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్, సుధాకర్ పాల్గొన్నారు.

# జడ్చర్ల బంద్ ప్రశాంతం

- రంగనాయక స్వామి ఆలయం వద్ద కోనేరు పూడ్చివేతకు నిరసన
- నిందితులను కఠినంగా శిక్షించాలని ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యుల డిమాండ్



జడ్చర్లలో బంద్ సందర్భంగా మూసిఉన్న దుకాణాలు

జడ్చర్లటౌన్, జూలై 8 : జడ్చర్ల మున్సిపాలిటీలోని బాదేపల్లి పెద్దగుట్టపై ఉన్న రంగనాయకస్వామి ఆలయం ఎదుట ఉన్న కోనేరు పూడ్చివేతను నిరసిస్తూ సోమవారం చేపట్టిన 'జడ్చర్ల బంద్' ప్రశాంతంగా ముగిసింది. ధార్మిక సంఘాలు, ఆలయ పరిరక్షణ కమిటీ పిలుపుమేరకు పట్టణంలోని వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థలను స్వచ్ఛందంగా బంద్ చేశారు. బాదేపల్లి పాతబజార్ ఆంజనేయస్వామి ఆలయం నుంచి పట్టణ ప్రధాన రహదారులపై ధార్మిక సంఘాలు, ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యులు, యువకులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కోనేరు పూడ్చివేతకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం నేతాజీ కూడలిలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దుండగులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపి అనుమానం రాకుండా కోనేరు పూడ్చివేతకు పాల్పడ్డారని ఆరోపించారు. వెంటనే అదుపులోకి తీసుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, ఎస్సైలు పోలీసులతో కలిసి బందోబస్తు నిర్వహించారు.

### కోనేరు, కట్టడాలు ధ్వంసం చేయడం బాధాకరం : మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల, జూలై 8 : రంగనాయకస్వామి ఆలయ కోనేరు పూడ్చడం, ఇతర కట్టడాలను కూల్చివేయడం బాధాకరమని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి కోసం కేసీఆర్ హయాంలో రోడ్డుమార్గం, శంఖుచక్ర నామాలు వంటి పనులను చేశామన్నారు. అలాగే గుట్టపై అభివృద్ధి పనులు, పార్కు ఏర్పాటు చేసేందుకు నిధులను కూడా మంజూరు చేశామన్నారు. టెండర్ పిలిచి కాంట్రాక్టర్ కొంత పనులు కూడా చేశారన్నారు. ఎన్నికల నేపథ్యంలో పనుల్లో జాప్యం జరిగిందన్నారు. ఇంతలోనే ఇలాంటి ఘటన జరగడం బాధాకరమన్నారు. ప్రజలు, భక్తులు, పెద్దలు, యువకులు ఎవరూ ఆందోళన చేయకూడదని కోరారు. ఆలయ గుండానికి పూర్వవైభవం, ఆలయ అభివృద్ధి కోసం మనమందరం కలిసి పాటుపడదామన్నారు.



ధార్మిక సంఘాలు, ఆలయ కమిటీ సభ్యుల ర్యాలీ

# ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

- కల్వకుర్తిలో నిరుద్యోగులు, బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో ధర్నా



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్‌వీ నేతలు, నిరుద్యోగులు

కల్వకుర్తి, జూలై 8 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో రెండు లక్షల ఉద్యోగాలు చేపడతామని ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని బీఆర్‌ఎస్‌వీ కల్వకుర్తి మండలాధ్యక్షుడు గణేశ్ డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్‌వీ, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరుద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ నిరుద్యోగ భృతి, 11 వేలతో కాకుండా 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించాలని పేర్కొన్నారు. సమయం తక్కువగా ఉన్నందున డీఎస్సీకి ప్రిపేర్ అయ్యేందుకు వీలుగా సెప్టెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలన్నారు. గురుకులాల్లో ఖాళీగా ఉన్న 2 వేల బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని నిరుద్యోగులు, డీఎస్సీ అభ్యర్థులతో కలిసి ఆర్డీవో శ్రీనుకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్, బీఆర్‌ఎస్‌వీ మండల ఉపాధ్యక్షుడు నాగరాజు, కృష్ణ, నిరుద్యోగ సంఘం నాయకులు రాజునాయక్, పాండు, ప్రేమ్, శ్రీవాణి, మానస, మాధవి పాల్గొన్నారు.

### తల్లిని హత్య చేసిన కొడుక్కి
# పదేండ్ల జైలుశిక్ష

- తీర్పు వెల్లడించిన గద్వాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుషా

గద్వాల అర్బన్, జూలై 8 : తల్లిని హత్యచేసిన కొడుకుకు పదేండ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ జోగుళాంబ గద్వాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.కుషా తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన కృష్ణజడ రాముడు, నాగమ్మకు ముగ్గురు కుమారులు, నలుగురు కూతుళ్లు ఉన్నారు. వారిలో చిన్న కొడుకు ప్రేమ్‌రాజ్ ప్రేమ పెండ్లి చేసుకొని హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. అయితే, మార్చి 26, 2023న రామాపురం చేరుకొని తల్లిదండ్రులను నగదు కావాలని వేధించాడు. తమ దగ్గర లేవని చెప్పినా వినకుండా ఏప్రిల్ 7, 2023న తండ్రిపై గొడ్డలితో దాడి చేసేందుకు యత్నించగా.. అడ్డుగా వచ్చిన తల్లిపై కూడా దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త రాముడు ఫిర్యాదు మేరకు శాంతినగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం ప్రేమ్‌రాజ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పూర్తి వివరాలను పరిశోధించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ క్రమంలో సోమవారం ఇరువర్గాల వాదనల అనంతరం నేరం రుజువుకావడంతో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. కోర్టులో ట్రయల్ సమయంలో నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన ఏఎస్పీ గుణశేఖర్, డీఎస్పీ సత్యనారాయణ, శాంతినగర్ సీఐ రత్నం, అప్పటి సీఐ శివశంకర్, అప్పటి ఎస్సై శ్రీనివాసులు, ప్రస్తుత ఎస్సై సంతోష్, పీపీ త్రిపాఠి, కోర్ట్ లైసెన్స్ హెడ్ కానిస్టేబుల్ పరమేశ్, గౌస్‌ఫీర్‌ను ఎస్పీ తోట శ్రీనివాసరావు అభినందించారు.

# టీబీ డ్యాంకు భారీ వరద

- 24 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అయిజ, జూలై 8 : కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు భారీ వరద వస్తున్నది. సోమవారం టీబీ డ్యాంలో 24,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 156 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది. పూర్తి స్థాయి నీటి నిల్వ 105.855 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 20.851 టీఎంసీల నిల్వ ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.